క్లుప్తంగా

క్రీడల్లో బొడ్డపాడు విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ క్రీడా ప్రతిభను కనబరిచారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జె.భాగ్యరాజ్, వంకల మోహన్‌కృష్ణ ప్రథమ స్థానం సాధించి పాఠశాలకు పేరు తెచ్చారు. వీరిని ప్రధానోపాధ్యాయులు ఎ.వీర్రాజు, పీడీ సి.హెచ్.రఘురామ్‌జీ, ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వి.రమణలు బుధవారం అభినందించారు.

ఆఫ్‌షోర్‌పై ప్రభుత్వానికి చిన్నచూపు



మాట్లాడుతున్న వెంకటరమణ

కాశీబుగ్గ: ఆఫ్‌షోర్ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు చిన్నచూపని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరావు ప్రశ్నించారు. పలాసలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆఫ్‌షోర్‌కు విడుదల చేసిన రూ.35 కోట్లు బడ్జెట్ రాజకీయాలకు ప్రచారానికి తప్పా పది శాతం పనులు జరగవని అన్నారు. 2015 భూసేకరణ చట్టం ప్రకారం ఈ నిధులు ఎందుకూ పనికిరావని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చాపర వేణుగోపాలరావు, సీహెచ్ రవి కుమార్ ఉన్నారు.

హౌసింగ్ గ్రీవెన్స్‌కు 18 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ గ్రీవెన్స్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడ్కో, అర్బన్ హౌసింగ్‌కు సంబంధించి మొత్తం 18 వినతులు స్వీకరించారు. టిడ్కో ఇళ్లకు డిపాజిట్ చేసిన వారు ఆందోళన చెందవద్దని.. అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఇళ్లకు సంబంధించిన సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు.

చెత్త తరలింపు వాహనాలకు మరమ్మతులు



మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని చెత్త తరలింపు వాహనాలు పాడయ్యాయి. దీంతో వీటికి బుధవారం మరమ్మతులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీబుగ్గలో విజిబుల్ పోలీసింగ్



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న సీఐ మోహనరావు, సిబ్బంది

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా నివారణపై పోలీసులు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా కాశీబుగ్గ సీఐ మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో వివిధ కేటగిరీలకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుండి జారిపడి యువకుడికి గాయాలు

సంతబొమ్మాళి: కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ వద్ద బుధవారం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టాల పక్కన కొన ఊపిరితో ఉన్న యువకుడిని రైల్వే పోలీసులు గుర్తించి 108 వాహనంలో కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో కోటబొమ్మాళి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. యువకుడికి స్పృహ రాకపోవడంతో వివరాలు తెలియాల్సి ఉందని రైల్వేపోలీసులు పేర్కొన్నారు.

సంత.. చింత!



మండుటెండలో ఉన్న పశువులు

- నారాయణవలస పశువుల సంతలో సమస్యల తిష్ట
- కానరాని మౌలిక వసతులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కోటబొమ్మాళి:

ఉత్తరాంధ్రాలోనే అతి పెద్ద పశువుల సంతగా పేరుగాంచిన నారాయణవలసలో సమస్యలు తిష్ట వేశాయి. అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉందన్న చందంగా తయారైంది ఇక్కడ పరిస్థితి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో.. ప్రతి గురువారం సంతను నిర్వహిస్తుండగా సుదూర ప్రాంతాల నుంచి పశు యజమానులు, వ్యాపారస్తులు పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లను తెచ్చి అమ్మకాలు, కొనుగోలు సాగిస్తుంటారు. వీటితోపాటు నిత్యావసర సరుకులు, కూరగాయలు, బట్టలు, చేపలు, కర్రలు ఇలా అన్నిరకాల వ్యాపారాలు ఇక్కడ జరుగుతుంటాయి. సంత నిర్వహణ కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో జరుగుతోంది. ఎంపీడీవో ఆధ్వర్యంలో ఏటా మార్చి నెలలో ఆశీల వేలం పాటను నిర్వహిస్తారు. ఏడాది కాలానికి పాటను ఖరారు చేస్తారు. వేలం ద్వారా ఏటా లక్షలాది రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. గత ఏడాది ఆశీల వేలం పాట ద్వారా 90 లక్షల ఐదు వేల రూపాయలు



చెట్టు కింద ఉన్న పశువులు

ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ. 68 లక్షల 50 వేలు సమకూరింది. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ సంతలో కనీస మౌలిక వసతులైన మంచినీటి కుళాయిలు, పశువులకు విశ్రాంతి షెడ్లులు, సంతకు దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు కాసేపు సేదదీరేందుకు విశ్రాంతి షెడ్డులు, నిర్మాణాలు చేపట్టలేదు. కనీసం సంత చుట్టూ రక్షణ గోడ కూడా లేదు. దీంతో పశువులు, వాటి యజమానులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. చెట్ల కిందనే తలదాచుకోవలసి వస్తోంది. ఎండ, వానా కాలంలో పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఇటు మండల పరిషత్ అధికారులు, నారాయణవలస పంచాయతీ పాలకవర్గం సంత అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో ఎంతో ప్రాముఖ్యమున్న నారాయణవలస సంతలో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



నారాయణవలస సంతలో మౌలిక వసతులు కల్పించాలి. ఏటా ఆశీల ద్వారా భారీగా ఆదాయం వస్తున్నప్పటికీ అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదు. సరైన వసతుల్లేక సంతకు వెళ్లి ఇక్కట్లు పడుతున్నాం. అధికారులు స్పందించి వసతులను సమకూర్చాలి.

– దండాసి సింహాచలం, పాకివలస, కోటబొమ్మాళి మండలం

పనులు చేపట్టేందుకు కృషి చేస్తా



ఏటా ఆశీల పాట ద్వారా వస్తున్న ఆదాయాన్ని నారాయణవలస పంచాయతీలోని బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నాం. ఆ గ్రాంటుతో అభివృద్ధి పనులు జరపాలి. పనులు నిర్వహణ పంచాయతీ కార్యదర్శి బాధ్యతతో చేపట్టాలి. ఇంత వరకూ అలా చేయలేదు. దీంతో ఇప్పటి వరకూ పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు జరగలేదు. త్వరలో సంతలో మౌలిక అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తాను.

– కె.ఫణీంద్రకుమార్, ఎంపీడీవో, కోటబొమ్మాళి

గురుకుల విద్యార్థుల సత్తా..



ధనుష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అప్పారావు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యాదగిరి

కంచిలి: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో కంచిలి బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు సత్తా చూపించారు. ఈ విద్యాలయం పరిధిలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వై.ధనుష్ విజయవాడలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన అండర్–19 విభాగంలో వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం దక్కించుకున్నాడు. అలాగే ఇదే కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థి కె.యాదగిరి అండర్–19 విభాగంలో అథ్లెటిక్ పోటీల్లో జావెలిన్ త్రో పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకొని సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు అక్టోబర్ 24, 25 తేదీల్లో కర్నూల్లో నిర్వహించారు. విద్యార్థులను గురుకుల ప్రిన్సిపాల్ బి.అప్పారావు, పీఈటీ ఎర్రయ్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

మృతుల కుటుంబాలకు తిలక్ పరామర్శ



నందిగాం: భీమారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తిలక్

నందిగాం: ప్రతాపవిశ్వనాథపురం, దిమిలాడలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి బుధవారం పరామర్శించారు. ప్రతాపవిశ్వనాథపురం గ్రామానికి చెందిన బమ్మిడి జగన్నాథరావు తండ్రి భీమారావు మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను, దిమిలాడకు చెందిన ననవల సరేష్ తండ్రి సత్యం మృతి చెందడంతో వారి కుటంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. నాయకులు కోనారి రామారావు, దట్టి శాంతారావు, కిక్కర రామారావు, బమ్మిడి కురమయ్య, కంచరాన వాసుదేవ్, బాలక మధుసూదనరావు, బొంగి హనుమంతురావు, బాలక ప్రభాకరరావు ఉన్నారు.

కోటబొమ్మాళి: సీనియర్ జర్నలిస్టు తలగాపు వెంకటరమణ భార్య ఝాన్సీ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి బుధవారం వెంకటరమణను పరామర్శించారు. నాయకులు కాల్ల సంజీవరావు, రాంపాత్రుని శివారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



సంఘటన స్థలంలో పడి ఉన్న శ్యామసుందర్ మృతదేహం



మృతుడు శ్యామసుందర్(ఫైల్)

కంచిలి: మండలంలోని జలంత్రకోట కూడలి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని, సోంపేట మండలం పాలవలస పంచాయతీ పరిధి కుమ్మరిపాడు గ్రామానికి చెందిన కాళ్ల శ్యామసుందర్(35) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు శ్యామసుందర్ మంగళవారం సాయంత్రం మండలంలోని గొల్లపుట్టుగ గ్రామంలో ఉన్న అత్తవారింటికి వెళ్లి, తిరిగి స్వగ్రామానికి తన బైక్‌పై తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు అజాగ్రత్తగా వెళ్లే వాహనం వెనుక నుంచి ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం మీద నుంచి ఎగిరిపడి తల రోడ్డుకు గట్టిగా తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతునికి భార్య త్రివేణి, ఐదేళ్ల కుమార్తె హన్షిత ఉన్నారు. భర్త మృతి చెందడంతో ఆ ఇల్లాలు, మిగతా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని భార్య త్రివేణి ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్.ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సోంపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి



టెక్కలి: ప్రజాపోరు గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

టెక్కలి: విద్యుత్ ట్రూఅప్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరులో భాగంగా టెక్కలిలో ప్రజా పోరు గోడ పత్రికను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఎస్.షణ్ముఖరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో పేద, సామాన్య వర్గాలపై పెను భారం వేశారని దుయ్యబట్టారు. ఉచిత ఇసుక పేరుతో దోపిడీ చేస్తున్నారని, నిత్యావసర సరుకుల ధరలను అమాంతం పెంచేశారని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నిరుద్యోగ భృతి ఊసే లేదని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలని, ఉద్యోగుల తొలగింపు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, మహిళలు, దళితులపై చేస్తున్న దాడులు, అత్యాచారాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఎల్లయ్య, యు.లక్ష్మణరావు, యు.మాధవరావు, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు బమ్మిడి ఆనందరావు కోరారు. ఈ మేరకు నగరంపల్లిలో ప్రజా పోరు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. నాయకులు నెయ్యిల మోహన్, టి.భాస్కరరావు, బి.రామక్రిష్ణ,బి.సుగున,బి.లక్ష్మీ, బి.హిందుమతి, టి.యశోద ఉన్నారు.

తరచూ గ్రామాలను సందర్శించండి

- డీఎస్పీ వెంకట అప్పారావు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ప్రతీ గ్రామాన్ని తరచూ సందర్శించాలని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు వజ్రపుకొత్తూరు పోలీసులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, ఎస్‌ఐ కె.నిహార్‌తో మండలంలోని స్థితిగతులు, రాజకీయ ప్రాధాన్యత, నేతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్షిక తనిఖీలు చేపట్టిన ఆయన క్రైం రికార్డులను, ఇతర దస్త్రాలను పరిశీలించారు. క్రైం రేషియో పెరగకుండా చూసుకోవాలని, నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. రోడ్డు భద్రతా చర్యలు, మాదక ద్రవ్యాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న విద్యార్థి నాయకులు

కాశీబుగ్గ: పలాస ఎస్టీ పోస్టుమెట్రిక్ బాలుర వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐఎస్ నాయకులతో పాటు విద్యార్థులు కోరారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తిని బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. వార్డెన్ తీరుతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, హాస్టల్లో సరైన సదుపాయాల్లేవని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. 120 మంది విద్యార్థులు ఉన్న వసతి గృహంలో సరిపడా బాత్ రూమ్‌లు లేకపోవడంతో సకాలంలో పిల్లలు తరగతులక వెళ్లలేక పోతున్నారని, అలాగే కుక్‌లు తక్కువ మంది ఉండడంతో సమయానికి భోజనం కూడా సిద్ధం చేయడం లేదని వివరించారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐఎస్ నాయకులు టి.ఎం.రాజు, ఎస్.ధర్మారావు, పి.మధు, ఎన్.రాఘవేంద్ర, సీపీఎం నాయకులు నెయ్యిల గణపతి ఉన్నారు.

తోటూరు సముద్ర తీరంలో విష్ణు హారతి



గంగమ్మకు విష్ణు హారతి సమర్పిస్తున్న జ్యోతిర్మయి తదితరులు

వజ్రపుకొత్తూరు రూరల్: కార్తీక క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా తోటూరు సముద్ర తీరంలో బుధవారం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో విష్ణు హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పర్యావరణంతో పాటు రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రైతులకు పాద పూజలు చేపట్టారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చరణ నడుమ మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ కుటుంబ సభ్యులు విష్ణు హారతిని గంగమ్మకు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విష్ణుమూర్తికి, గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు నౌపడ విద్యార్థి



సంతబొమ్మాళి: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు నౌపడ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చిదపాన గౌరీస్వరూప్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్, పీడీ జనార్దనరావు తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 కబడ్డీ పోటీలలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాలుర, బాలికల జట్లు ప్రథమస్థానంలో నిలిచాయి. ప్రథమ స్థానంలో నిలిచిన బాలుర జట్టులో నౌపడ ఉన్నత పాఠశాలకు చెందిన చిదపాన గౌరీ స్వరూప్, గిన్ని శంకర్‌రెడ్డి, బాలికల జట్టులో కోట వసుంధర ప్రధాన భూమిక పోషించారన్నారు. స్వరూప్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కాశీబుగ్గ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పలాస శాఖా గ్రంథాలయ అధికారి వై.రాంబాబు బుధవారం తెలిపారు. వారం రోజులపాటు బాలలదినోత్సవం, సభ్యత్వ నమోదు, చిత్రలేఖన పోటీలు, గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు, యువతపై మాదక ద్రవ్యాల ప్రభావంపై వ్యాచరచన పోటీలు, మహిళా దినోత్సవం నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో గురువారం నుంచి నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ శాఖాధికారి ఎ.పోలయ్య కోరారు.

బారువ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

సోంపేట: బారువ రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలని సాధన కమిటీ సభ్యులు కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లు సభ్యులు బుధవారం తెలిపారు. మండలానికి సంబంధించి బారువ రైల్వేస్టేషన్ ఒక్కటే ఉందన్నారు. ఇక్కడ బ్రహ్మపురం–ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్, బ్రహ్మపురం–ఇంటర్‌సిటీ పాసింజర్, భువనేశ్వర్–విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, పూరీ–గుణుపూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఇక్కడ నిలుపుదల చేయాలని కోరారు.

అయ్యప్పపడి పూజల్లో మాజీ మంత్రి సీదిరి



అయ్యప్పస్వాములతో మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలో బుధవారం అయ్యప్పస్వాముల పడి పూజా కార్యక్రమం జరిగింది. పూజల్లో మాజీమంత్రి డాక్టర్ సీదిర అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


18 లీటర్ల సారా స్వాధీనం

సోంపేట: సోంపేట, మందస మండలాల్లో ఎక్సైజ్ సిబ్బంది బుధవారం దాడులు చేసి ముగ్గురుని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు. దాడుల్లో 18 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే కంచిలి మండలం బైరిపురం జంక్షన్ వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఓ వ్యక్తి నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

డైరెక్టర్ల నియామకం

పలాస: కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మందస మండల టీడీపీ అధ్యక్షుడు భావన దుర్యోధన నియమితులయ్యారు. అలాగే అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డెరెక్టర్లుగా పలాస మండల టీడీపీ అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణకుమార్, వజ్రపుకొత్తూరు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

ఇచ్ఛాపురం: విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ కోరారు. ఇచ్ఛాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్‌వినియోగదారుల సమస్యలకు పరిష్కార వేదిక నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి సమస్యలు ఎదురైతే ఫిర్యాదులు చేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం 11 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 8222 ఫిర్యాదులు రాగా అందులో 8100 ఫిర్యాదులు పరిష్కరించినట్లు తెలిపారు.

ఏపీఎస్‌టీయూ రాష్ట్రకార్యవర్గంలో జిల్లా ప్రతినిధులు



మజ్జి చినబాబు



తమ్మినాన చందనరావు

వజ్రపుకొత్తూరు: నూతనంగా ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్‌టీఏ)లో శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులకు స్థానం లభించింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మజ్జి చిన్నబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తమ్మినాన చందనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో అడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. చినబాబు వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, చందనరావు సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

టెక్కలి ఏఎస్‌ఐ సస్పెన్షన్



నరసింగరావు

టెక్కలి: టెక్కలి పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ టి.నరసింగరావును ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి సస్పెన్షన్ చేసిన సంఘటన కలకం రేపుతోంది. ఓ గ్రానైట్ వ్యాపారి నుంచి రూ.5 వేలు అక్రమంగా తీసుకున్నారనే విషయం నేరుగా ఎస్పీకు తెలియడం.. ఆయన రంగంలోకి దిగి ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేసి ఒక్కసారిగా సస్పెన్షన్ వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. ఏఎస్‌ఐ చేసిన అక్రమ వసూళ్లలో కొంత మంది సిబ్బందికి వాటాలు సర్దుబాటు చేయకపోవడంతో రహస్యంగా ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని చేరవేశారనే విషయం అంతర్గతంగా ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా సస్పెన్షన్‌కు గురైన ఏఎస్‌ఐ నరసింగరావుపై అనేక అక్రమ వసూళ్ల ఆరోపణలు ఉన్నాయి. వివిధ ఘటనల్లో స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుల నుంచి దండిగా వసూలు చేయడం ఆయనకు సర్వసాధారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, టెక్కలి పరిధి పోలీస్ స్టేషన్‌లో మరి కొంత మంది గురించి కూడా ఎస్పీకు రహస్య సమాచారం చేరవేసినట్లు తెలుస్తోంది.

గుర్తు తెలియని మహిళ మృతి

కాశీబుగ్గ: శ్రీకాకుళం రోడ్డు – తిలారు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు పలాస జీఆర్‌పీహెచ్ ఎం.సోమేశ్వరరావు బుధవారం తెలిపారు. మృతురాలి వయసు 60 నుంచి 65 ఏళ్లు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440627567 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

టెక్కలి: రెవెన్యూ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి గత ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాల లేఅవుట్‌ల వివరాలను పక్కాగా సేకరించాలన్నారు. ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి ఉన్నారు.